**మేలుకునేందుకు....**

కౌసల్యా సుప్రజారామా....
దేవుణ్ని మేలుకొల్పుస్తోత్రం
అల్లాహ్ ఓ అక్బర్...
దేవుణ్ని గుర్తుచేసుకొమ్మనే పలుకు
హేప్రభూ! ఆదుకొమ్మనే పిలుపు

ఏదైతేనేం! ఉనికిని పట్టి ఉంచేందుకు
ఒకటి దైవత్వాన్ని రెండు మానవత్వాన్ని,
మరొకటి మన అసహాయతను గుర్తుచేసే యత్నం
వెరసి మనుషులను స్పృహలో ఉంచే ప్రయత్నం
కరడుగట్టిన హృదయకవాటానికి బైపాస్ చిట్కా

భాష మారింది, కల్తీలు, కలగలుపులు
ఎలాగైతేనేం! మాట్లాడుకుంటున్నాం
ప్రింటులో, ఈమేల్, జీమేల్, యాహూలతో
కుదించుకున్న మనసులకు ఎస్ ఎమ్ ఎస్‌లు
ఆగిపోనున్న హృదయానికి ఓ స్టంట్‌లా

టీవిచానల్స్‌లో ఐ లవ్ యూతో
వాలంటీన్స్‌డేలు గ్రీటింగ్ ముక్కలతో
షార్ట్‌కట్, ఫాస్ట్‌ఫార్వర్డ్ జీవితానికి
ప్రేమను చేష్టలతో, త్యాగాలతో,
బరువైన నిట్టూర్పులతో ఇక చూపించక్కర్లేదు

ప్రేమిస్తున్నానంటే ఒప్పుకో లేకపోతే చచ్చిపో
ఎలాగైతేనేం జీవితం అంతా ప్రేమమయమే
భ్రమలో బతికేయగలుగుతున్నాం
పూటగడవకపోయినా, భవిష్యత్తు భయపెడుతున్నా
జీన్‌పాంటు పంక్ కటింగ్ చేతిలో సెల్‌తో
బోల్డంత విల్...తో మనసుల గురించే మాటల్లో

నిండుమనసుతోనా! స్వచ్ఛంగానా! అచ్చంగానా
అడగకు మరి....
కలవరపరిచే కపటకల్లోల కాంక్రీట్ జంగల్లో
చూట్టూ కనిపించే అమానవీయ (సం)ఘటనల్లో
నిదురించే మానవతను ఎవరు మేల్కొల్పాలి?
బారుగా చేతులను చాచి బంధించే దాష్టికతను
ఎవరు భూతంగా సీసాలో బంధించాలి?

చరిత్ర ఎపుడూ మొదటిపాఠం అయితే
భవిష్యత్తుకు సాక్ష్యం పలికేదెవరు?
వర్తమానం అక్షరంగా మార్చేదెలా?
పుస్తకంలో పేజీలు చేర్చేదెవరు?
అస్తిత్వాన్ని భావిజీవితానికి అందించేదెవరు?

పాట ఎపుడూ కూనిరాగమే అయితే
ఎలుగెత్తిన కంఠం కీచుగొంతుకే అవుతుంది
కాలం సాగుతూ సమయం మించిపోతూ...
జీవితం వెళ్ళమారుతూనే ఉంటుంది
స్థబ్ధత, సందిగ్ధత సందర్భంగా మిగుల్తుంది

పేలవంగా ప్రశ్నల్తో, సుదీర్ఘ నిట్టూర్పులతో
పనిలో, ఉత్సాహంతో, కేరింతలతో,
మేలుకునే ఉన్నాం అనేందుకవే సాక్షి
ఎట్లైనా... దుష్టత్వం భూస్థాపితం అవ్వాలి
దుర్నీతి మట్టిలో కల్సిపోవాలి

శాపం ఫలించాలంటే ధర్మం నాలుగు కాదు,
ఆక్టోపస్ పాదాలమీద నడవాలి
అందుకే మేల్కొల్పులు వేల్పులకు కాదు
అల్లా, దేవా, ప్రభువా! అనేందుకు
సుప్రజారామా, అల్లాహ్ ఓ అక్బర్, హే ప్రభూ!